క్లుప్తంగా

'మనూ'లో 12న మెగా జాబ్‌మేళా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'జష్న్-ఏ-బహారన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉర్దూ యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్(టీఅండ్‌పీసీ) ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ యూసుఫ్‌ఖాన్ తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, గెలాక్సీ ప్లేస్‌మెంట్ సర్వీసెస్, అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) సంయుక్తంగా మేళా నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా ఉత్సవం 'జష్న్-ఏ-మహారన్-2023'లో భాగంగా ఈ ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 50 కంపెనీలు, సంస్థలు, ఎంఎన్‌సీలు, ఫెడరేషన్లు, సుమారు నాలుగు వేల ఖాళీలను భర్తీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

నేడు ఊరూరా చెరువుల పండుగ

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సీఎం గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువు వద్ద ఊరూరా చెరువుల పండుగ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తకుంట చెరువు వద్ద సాయంత్రం 5 గంటలకు చెరువుల పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు టమాట రూ. 35, పచ్చిమిర్చి 60, బెండ 45, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 35, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 20, అల్లం 220, వెల్లుల్లి 140.

నేడు సంత జరిగే ప్రాంతాలు

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఎన్టీఆర్‌కాలనీ, హుడాకాలనీ, ఆల్విన్‌కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం, టెలికామ్‌నగర్ ఉర్దూయూనివర్సిటీరోడ్డు, దూబేనగర్, టీఎన్‌జీఓకాలనీలో సంత జరుగుతుంది. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగే సంతల్లో సరసమైన ధరలకు ఆకుకూరలు, కూరగాయలు, దుస్తులు, నిత్యావసరాలు లభిస్తాయి.

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నుమాకు వెళ్లే ఎంఎంటీఎస్ రైళ్ల వేళలు.

నాంపల్లి వైపు వెళ్లే రైళ్లు: ఉదయం: 6:40, 7:40, 8:10, 9:15, 10:15, 11:10 , 11:55

మధ్యాహ్నం: 12:50 , 13:20 , 14:25, 15:20

సాయంత్రం: 16:10, 17:55

రాత్రి:18:55, 20:05, 21:25

సికింద్రాబాద్ వరకు: రాత్రి 22:50, 23:25

ఫలక్‌నుమామా వైపు వెళ్లే రైళ్లు:

ఉదయం: 5:50, 6:30, 6:50, 8:25, 9:05, 9:31, 10:05, 11:20 , 11:40.

మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55 , 15:10

సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35

రాత్రి: 19:10, 19:55, 21:00, 21.15, 21:45.

స్టీరింగ్ లాక్‌తో డివైడర్‌ను ఢీకొన్న కారు

రాయదుర్గం: రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని వైకుంఠ మహాప్రస్థానం సమీపంలో బుధవారం ఓ కారు అకస్మాతుగా స్టీరింగ్ లాక్ కావడంతో డివైడర్‌ను ఢీ కొట్టింది. పెద్ద ప్రమాదం కాకపోవడంతో కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

11న ఆకార్‌ఆశ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ప్రధాన రహదారిలోని రాందేవ్‌రావు ఆస్పత్రి సమీపంలోని ఆకార్ ఆశ ఆస్పత్రి ఈనెల 11వ తేదీన శరీర పునర్నిర్మాణ శస్త్ర చికిత్సల కోసం ఉచిత పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులతో పుట్టుకతో కలిగే అంగ వైకల్యాలు, గ్రహణ మొర్రి, అగ్ని ప్రమాదాలు, యాక్సిడెంట్ల వల్ల కలిగిన అంగవైకల్యం, కణతులు వంటి తదితర వాటికి శిబిరంలో పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం .73373 18544.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు!

- నిరుపయోగంగా మోడ్రన్ టాయిలెట్స్
- నీటి సౌకర్యం లేక దుర్గంధంగా మారుతున్న వైనం
- కాంట్రాక్టర్లకు నిర్వహణ అప్పజెప్పి చోద్యం చూస్తున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు



మంజీరా రోడ్డులో దుర్గంధంగా మారిన మోడ్రన్ టాయిలెట్

మియాపూర్: జాతీయ రహదారులు, కాలనీ ప్రధాన రహదారులలో నిత్యం ప్రయాణించే వారి కోసం జీహెచ్‌ఎంసీ మోడ్రన్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేలా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లక్షల రూపాయాలతో నిర్మించిన మోడ్రన్ టాయిలెట్స్ ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారాయి. చందానగర్ సర్కిల్ పరిధిలో పలు చోట్ల నిర్మించి ఏర్పాటు చేసిన టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. నీటి సౌకర్యం లేక అపరిశుభ్రంగా మారాయి. దీంతో ప్రజలు టాయిలెట్స్‌కు వెళ్లలేక రోడ్ల పక్కన మూత్ర విసర్జన చేస్తుండటంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసి ఈ టాయిలెట్లు పనికి రాకుండా పోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు అప్పగించి అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని పర్యవేక్షణ..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా చందానగర్, మియాపూర్ ప్రాంతాలలో మోడ్రన్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ కోసం అధికారులు కొంతమంది కాంట్రాక్టర్లకు అప్పగించారు.ఎలాంటి ప్రణాళికలు లేకుండా ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ప్రజలు టాయిలెట్స్‌లోకి వెళ్లేందుకు కూడా రాని విధంగా ఏర్పాటు చేశారు. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వాటి జాడ కనిపించడం లేదు. డిమాండ్ ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేయకుండా ఉపయోగం లేని చోట ఏర్పాటు చేసి లక్షల రూపాయాలు వృథా చేశారని ఆయా ప్రాంతాల ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయాలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన టాయిలెట్లు అధ్వానంగా మారిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యం వహించడం పై ప్రజలు మండి పడుతున్నారు.

వినియోగంలోకి తేవాలి..

జీహెచ్‌ఎంసీ .ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడ్రన్ టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉన్నాయి. వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. దుర్గంధంగా మారడంతో అందులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు అధికారులు స్పందించి మోడ్రన్ టాయిలెట్స్‌ను శుభ్రపరిచి వినియోగంలోకి తీసుకురావాలి.

–అనిల్, ప్రయాణికుడు

బీఆర్ఎస్ హయాంలోనే చెరువుల పునరుద్ధరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్ హయాంలోనే చెరువులను పునరుద్ధరించినట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సాకి చెరువుకట్టపైన నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రెడ్డి, కాకతీయుల కాలంలో చెరువులను పునరుద్ధరించి పూడికలను తీస్తే మళ్లీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పథకం ప్రవేశ పెట్టి చెరువులకు పూర్వవైభవం తీసుకువచ్చారన్నారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల పరిధిలోని చెరువుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. పట్టణంలోని సాకి చెరువు అభివృద్ధికి ఇంకార్ సంస్థ సహకారంతో రూ.5 కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజావెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఆర్ సేవలను విస్తృతం చేస్తాం


ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులతో నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఎన్‌ఎంఆర్ యువసేన సేవలను విస్తృతం చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని బొమ్మనకుంట గ్రామంలో బుధవారం ఎన్‌ఎంఆర్ యువసేన ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మనుకుంట గ్రామపంచాయతీ నాలుగో వార్డుసభ్యులు రాజు తదితరులు నీలం మధు సమక్షంలో ఎన్‌ఎంఆర్ యువసేనలో చేరారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. ఎన్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని వివరించారు. .

చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్ బస్తీ దవాఖానా భవనంలో హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో విమెన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం ద్వారా జెండర్ అండ్ క్లైమెట్ చేంజ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌లక్ష్మీబాయి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వీరేశంగౌడ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను చైల్డ్ ఫండ్ సభ్యులకు వివరించారు. భవిష్యత్‌లో రాబోయే విపత్తులను నివారించడానికి సలహాలను సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, ఫీల్డ్ ఆఫీసర్ అనురాజ్, ఆర్గనైజర్ దీప, మొబలైజర్స్ రమేష్, ఆనందం, షబానా, పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన


విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేస్తున్న నితికాపంత్

రాయదుర్గం: మహిళలు, యువతులు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని సైబరాబాద్ డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ డీసీపీ నితికాపంత్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్ విజిట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు విమెన్ అండ్ చైల్డ్ అండ్ సేఫ్టీ వింగ్ డీసీపీ నితికాపంత్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ విజిట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ హౌస్ విజిట్‌లో భాగంగా వివిధ కళాశాలలకు చెందిన 110 మంది విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థినులకు విమెన్ పోలీస్ స్టేషన్, షీ–టీమ్ పోలీస్ స్టేషన్లు, భరోసా కేంద్రాలను పనితీరును వివరిస్తూ వాటి ప్రాముఖ్యాన్ని వివరించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు, చిన్నారులకు సైబరాబాద్ పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థినులు సందేహాలను నితికాపంత్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశం , వేణుమాధవ్, విమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునీత పాల్గొన్నారు.

సికిల్ సెల్ సొసైటీ సేవలు అభినందనీయం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శివరాంపల్లి వేదికగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు విశేష సేవలందిస్తున్న తలసీమియా సికిల్ సెల్ సొసైటీని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ జనాబ్ డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసి అభినందించారు. బుధవారం సొసైటీలోని సౌకర్యాలు, రోగులకు అందించిన కీలకమైన సేవలను ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఆరోగ్య సవాళ్లలో తలసీమియా ప్రధానమైనదని బాధితులకు సమగ్ర సంరక్షణ, మద్దతు అందించడం మన బాధ్యత అని అన్నారు. ఈ వేదిక ద్వారా నిబద్ధతతో తలసీమియా బాధితులకు సేవలందించడం అభినందనీయమన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా తలసీమియా రహిత సమాజంగా మార్చేందుకు అందరికీ హెచ్‌బీఏ–2 పరీక్షను తప్పనిసరి చేయడంలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ ప్యాట్రన్ నరేష్ రాఠీ, వైస్ ప్రెసిడెంట్ రత్నావళి, సీఈఓ డాక్టర్ సుమన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ శబ్దాలతో నిత్యం ఇక్కట్లు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మి దేవాలయ వెనుక ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణ శబ్దాలతో నిత్యం ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా శబ్దాలు చేస్తూ నిర్మాణాలు చేపడుతుండటంతో కంటికి కునుకు లేకుండా పోతుందని వాపోతున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని రుక్మిణి సత్యభామ సహిత మురళీకృష్ణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, సర్పంచ్ దండు నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు

విశ్వవిద్యాలయాల ప్రతిష్టను దిగజార్చడం బాధాకరం

జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: ఓయూ జాక్ పేరు మీద, టీఎస్ జాక్ పేరు మీద కొందరు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ప్రతిష్టను దిగజార్చటం బాధాకరమని జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి జవ్వాజి దిలీప్ సాహూ అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ పరిపాలనా భవనం ఆయన మాట్లాడుతూ... కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థి నాయకులను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. కిట్స్ కోదాడ ఇంజినీరింగ్ కళాశాల ఒక్కటే కాదు, ఏ కళాశాలలో అయినా తప్పుడు పత్రాలు ఇస్తే వారికి అనుమతులు జేఎన్‌టీయూహెచ్ ఉన్నతాధికారులు ఇవ్వరని తెలిపారు. ఒకవేళ కిట్స్ కళాశాల యాజమాన్యం తప్పుడు పత్రాలు ఇచ్చినట్లుగా ఆధారాలుంటే ఆయా విద్యార్థి నాయకులు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా వీసీ డౌన్ డౌన్ అని నినాదాలు చేయటం సరికాదన్నారు. ఇలాంటి విధానాలు విశ్వవిద్యాలయాల ప్రతిష్టకు భంగం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఓయూ జాక్ నాయకులు ముందుగా ఓయూ అభివృద్ధి గురించి ఆలోచన చేయాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయి వర్షిత్, పవన్, శివకృష్ణ, బ్రహ్మం, దినేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నేడు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు 3వ ఫేజు ఎల్ఐజీ 66 కన్యకా పరమేశ్వరి ఆలయం వెనుక నూతన పైప్‌లైన్ పనులకు, 8.45గంటలకు కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వార్డు కార్యాలయం ఎదురుగా కాంపౌండ్ వాల్ నిర్మాణం, 9గంటలకు 4వ ఫేజ్‌లో పార్కు కాంపౌండ్‌వాల్ నిర్మాణం, 9.15గంటలకు 7వ ఫేజ్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్ వెనుక సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు, 9.30గంటలకు గోపాల్‌నగర్‌లో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు, 9.45గంటలకు విశ్వంభరా ఎన్‌క్లేవ్ వద్ద పార్కు చివర కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు, 10గంటలకు వసంత్‌నగర్ పిల్లల పార్కు వద్ద టెన్నిస్ కోర్టు కాంపౌండ్ వాల్, 10.15గంటలకు భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2 సీసీరోడ్డు నిర్మాణం, 10.30గంటలకు ఎస్ఆర్ఎస్ఐ కాలనీ కమాన్ దగ్గర సీవరేజ్ లైన్ కోసం, 10.45గంటలకు డ్రీమ్ వ్యూకాలనీ వద్ద పార్కు కాంపౌండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమాలకు కేపీహెచ్‌బీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు రావాలని కోరారు.

చిన్నారుల నాట్యం.. ప్రేక్షకులు మంత్రముగ్ధం


మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం భరతకళాప్రపూర్ణ డాక్టర్ నటరాజ రామకృష్ణ 12వ వర్ధంతి సందర్భంగా మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ గురువు పేరిణి సందీప్ శిష్య బృందంచే ప్రదర్శించిన నాట్యాలు అలరించాయి. వినాయకగద్యం, మేళప్రాప్తి, బ్రహ్మాగద్యం, ఘంతరికిట, సంధ్యతాండవం, పృథ్విలింగ, దేవిస్తుతి, ఆకాశలింగ తదితర అంశాలను వర్షిత, కావేరి, అనన్య, ధనుశ్రీ, అనన్యశ్రీ, నిధి, శ్రీవిద్య, అపర్ణ, శ్రీవల్లీ ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.
–మాదాపూర్

ప్రేమ్‌నగర్‌బస్తీలో 'గడపగడపకూ బీజేపీ'


ప్రేమ్‌నగర్‌బస్తీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

హఫీజ్‌పేట్: పేద ప్రజల బాగుకోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్ బస్తీ ఏ– బ్లాక్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి బీజేపీ అధికారంలోకి రాగానే అన్ని కాలనీలు,బస్తీలను సమస్యలు లేని ప్రాంతాలుగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, రాజు, రంగన్న, రవీందర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రాజు జైస్వాల్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

సైబర్ వల.. బాధితులు విలవిల

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఖాతాలు ఖాళీ

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలకు ఇద్దరు గృహిణులు చిక్కుకుని మోసపోయారు. పార్ట్‌టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్ కు స్పందించి ఓ మహిళ రూ.57,800, మరో మహిళ రూ.1,48,972 పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్‌కు చెందిన ఓ మహిళకు మే 25న పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో సదరు వ్యక్తి ఆ మహిళ వివరాలను నమోదు చేసి నగదు పెడుతూ టాస్కులు ఇస్తూ వచ్చాడు. చివరికి ఆ మహిళ తాను పెట్టిన రూ.57,800కు రెట్టింపు నగదును ఇవ్వాలని అడగగా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేసింది.

- అమీన్‌పూర్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీకి చెందిన మహిళకు మే 29వ తేదీన పార్ట్ టైం ఉద్యోగమంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలను అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నమోదు చేసి రూ.1,48,972 పోగొట్టుకుంది.

కమీషన్ ఇస్తామంటూ..

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ యూట్యూబ్ లింకులు క్లిక్‌చేస్తే నగదు వస్తుందని, టాస్కులు పూర్తి చేస్తే 30 శాతం కమీషన్ ఇస్తామని ఆశచూపి సైబర్ మోసగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగిని మోసం చేసిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రామచంద్రాపురం పరిధిలోని విలమేలకు చెందిన రాయిశెట్టి వేణు ప్రైవేటు ఉద్యోగి. మే 22న అతడి వాట్సాప్ నంబర్‌కు ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేస్తే నగదు ఇస్తామంటూ మెసేజ్ రాగా తన వివరాలను నమోదు చేశాడు. అపరిచితులు చెప్పిన విధంగా ముందుగా రూ.2 వేలు నగదు పెట్టుబడి పెట్టగా రూ.2800 ఇచ్చారు. అనంతరం టాస్కులు పూర్తి చేస్తే 30 శాతం కమీషన్ ఇస్తామని ఆశ చూపగా బాధితుడు పలు దఫాలుగా రూ.6.85 లక్షలు పంపాడు. బాధితుడు తాను పెట్టిన నగదుకు కమీషన్ ఇవ్వమని అడగడంతో స్పందన రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన అమోర్ ఆస్పత్రి వైద్యులు


చికిత్స చేసిన అనంతరం కోలుకుంటున్న రాజేష్

కూకట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 25 శస్త్రచికిత్సలు చేయించుకున్న ఓ యువకుడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రి చీఫ్ ఆర్థో అంకాలజీ సర్జన్ డా. కిశోర్ బి రెడ్డి మాట్లాడుతూ.. భద్రాచలానికి చెందిన 27 ఏళ్ల రాజేష్ 2019లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అతడికి పలు శస్త్రచికిత్సలు చేశారన్నారు. మూడేళ్లలో 25 శస్త్ర చికిత్సలు చేసిన వైద్యులు చివరికి కాలు తొలగించాలని తెలిపారని అన్నారు. అనంతరం అమోర్ ఆస్పత్రికి వచ్చిన ఆ యువకుడికి వివిధ పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స చేశామన్నారు. బాధితుడి కాలి పాదం కూడా తీవ్రంగా దెబ్బతినడంతో దానికి కూడా అమోర్ ఆసుపత్రిలో విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ వైద్య బృందానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

న్యూ గౌతమ్‌నగర్‌లో సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమ్‌నగర్‌లో నూతనంగా వేసిన సీసీరోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కోట్ల రూపాయల వ్యయంతో డివిజన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని తెలిపారు.

క్రీడాకారులకు ధ్రువపత్రాల అందజేత


క్రీడాకారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం

మణికొండ: రెజ్లింగ్ క్రీడను నేర్చుకుంటే ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ అలవడటంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ అన్నారు. నార్సింగిలో గత నెల రోజులుగా కొనసాగిన సమ్మర్ కోచింగ్ ముగియడంతో క్రీడాకారులకు ఆయన బుధవారం ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెజ్లింగ్ క్రీడ అతి పురాతనమైనదని దానిలో రాణిస్తేనే అనేక రంగాల్లో ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందుతుందన్నారు. ఇలాంటి క్రీడను ఎంచుకుని రాణిస్తేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. రెజ్లింగ్ కోచ్ కొల్లూరు రాజ్‌కుమార్‌ముదిరాజ్, నాయకులు ఆనంద్, కైలాష్, ప్రశాంత్, నవీన్, సురేష్, సురేష్‌రెడ్డి, మహ్మద్ తదితరులున్నారు.